సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



ఒడిశా టు సూరత్

అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, వరంగల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. - 8లో▸



పద పద.. పార్టీ మారుదాం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. నాయకులు, కార్యకర్తలు తమకు అనుకూలంగా ఉండే పార్టీల వైపు క్యూ కడుతున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42^0 / 28^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కూడా వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ట్రైనీ కలెక్టర్ సేవలు అభినందనీయం



భూపాలపల్లి అర్బన్: ట్రైనీ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సేవలు అభినందనీయమని, తన శిక్షణాకాలంలో అంకితభావంతో పనిచేశారని జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమా శంకర్ ప్రసాద్ శిక్షణ ముగిసిన సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ట్రైనీ కలెక్టర్‌గా ఉమా శంకర్ ప్రసాద్ అన్ని శాఖల అధికారులతో కలిసి మెలిసి పనిచేసి వారి నుంచి ఆయా శాఖల పనితీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారని అన్నారు. భవిష్యత్తులో మంచి అధికారిగా గుర్తింపు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. తన శిక్షణ కాలంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, అన్ని శాఖల అధికారుల సహకారం చాలా అనుభవాలనిచ్చినట్లు వివరించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలు ముస్ముందు తనకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్‌ను శాలువాలు, జ్ఞాపికలతో కలెక్టర్ భవేష్‌మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఓ శామ్యూల్, సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, డీఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

అడ్వాలపల్లిలో గ్రామసభ



మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తీగల వాగు ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల ఏసీఈఎస్ సర్వే జాబితాపై శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన 71కుటుంబాల జాబితాను అడిషినల్ కలెక్టర్ సభలో చదివి వినిపించారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఇరిగేషన్ డీఈ, నిర్వాసితులు పాల్గొన్నారు.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24వ తేది నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి దేవరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిల్ అయిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతోపాటు, ఇంప్రూమెంట్, రీ వ్యాల్యూయేషన్ అవసరం ఉన్న విద్యార్థులు మే 2వ తేదీ లోపు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు.

సూరీడితో జాగ్రత్త..

వేసవికాలం అంటే ఎండ తీవ్రత కాస్త ఎక్కువగా ఉండడం సాధారణం. కానీ, ఏకంగా 40డిగ్రీల సెల్సియస్‌కు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తెల్లవారడమే ఆలస్యం అన్నట్లుగా ఉదయం నుంచే సూర్యప్రతాపం ప్రారంభం అవుతోండడంతో జనం ఇంటినుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. ఏప్రిల్‌లోనే ఇలా ఉండే మే నెలలో ఎండల ప్రభావం ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



తీవ్ర ఎండలతో ఉష్ణోగ్రతలు పైపైకి..

- వడదెబ్బతో గాల్లో కలుస్తున్న ప్రజల ప్రాణాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

భూపాలపల్లి అర్బన్: ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. వడదెబ్బ తగిలే ప్రమాదం లేకపోలేదు. జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈక్రమంలో ఎండ దెబ్బకు గురికాకుండా చల్లని వాతావరణం ఉన్నప్పుడే పనులు ముగించుకొని ఇల్లు చేరాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రత శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేసి ప్రాణాలకే ముప్పు వాటిల్లేలా చేస్తుందని చెబుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తాకిన వారి కాళ్లు వాపులు వస్తాయి. కళ్లు తిరగడం, శరీర కండరాలు పట్టుకోవడం, తీవ్రమైన జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తలతిరిగి పడిపోవడం జరుగుతుంది.

జాగ్రత్తలు..

- వేసవిలో డీ హైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడలో ఉండేందుకు ప్రయత్నించండి.
- గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండ సమస్యలు ఉన్నవారి శరీరాలకు అధిక సూర్యరశ్మి ప్రభావించి శరీరం త్వరగా డీ హైడ్రేషన్‌కు గురవుతుంది. దీంతో వ్యాధి తీవ్రత ఎక్కువ అవుతుంది.
- ఆల్కహాల్, సిగరేట్, కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.
- ఎండలో వెళ్లేటప్పుడు సన్‌గ్లాసెస్, తలకు టోపీ వంటిని ధరించాలి.
- వేసవిలో ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
- వేడి వాతావరణంలో శారీరక శ్రమ మంచిది కాదు. ఒకవేళ చేస్తే ప్రతి 20నిమిషాలకు ఒకసారి 5నిమిషాలు నీడలోకి వెళ్లాలి.
- ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. కారం, మసాలాలు లేకుంటే ఉత్తమం.
- ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ ద్రావణాలను తాగాలి.
- నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి.

ప్రాథమిక చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో తుడవాలి. వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- ఫ్యాను లేదా చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబొండం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం, గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు. అపస్మారక స్థితిలో ఉంటే వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

తేలికపాటి ఆహారం ఉత్తమం

వేసవిలో సాధ్యమైనంత వరకు నూనెతో తయారు చేసిన పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, జంక్ ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమం, తేలికపాటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి.

ఎనిమిది లీటర్ల నీరు తాగాలి



వేసవిలో రోజుకు ఎనిమిది లీటర్ల నీటిని తాగాలి. తెల్లని కాటన్ దుస్తులను మాత్రమే ధరించాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్న వారు ఎండలో ప్రయాణం చేయొద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాలంటే తలకు టోపీ, తల పాగా ధరించాలి. వడదెబ్బకు గురైతే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ విద్యాసాగర్, జనరల్ ఫిజీషియన్

జాగ్రత్తలు పాటించాలి



ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లొద్దు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచాం. నవజాత శిశువులను పల్చటి గుడ్డతో సగం వరకు కప్పి ఉంచాలి. ఇంట్లోనే ఉండే పిల్లలకు వేడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.

- డాక్టర్ మధుసూదన్, డీఎంఅండ్‌హెచ్‌ఓ

నేడు ఎంజేపీ ఆర్జేసీ, ఆర్డీసీ సెట్

- ఉమ్మడి జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు
- ఎంజేపీ ఆర్జేసీకి 6,574 మంది అభ్యర్థులు
- ఆర్డీసీకి 2,237 మంది

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల, ఎంజేపీ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంజేపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి, హనుమకొండ కో–ఆర్డినేటర్ సరిత శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించనున్నారు. 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 37 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 37 మంది అబ్జర్వర్లు విధులు నిర్వర్తించనున్నారు. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రాల్లో ఈప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎంజేపీ ఆర్జేసీ ప్రవేశ పరీక్షకు 6,574, ఆర్డీసీకి 2,237 మొత్తం 8,811 మంది పరీక్షలు రాయనున్నారు. అందుకు ఆయా జిల్లాల కో–ఆర్డినేటర్లు సరిత, మనోహర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అనిత, వెంకటేశ్వర్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు, అదనపు కలెక్టర్లు ఈప్రవేశ పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారు.

జిల్లాల వారీగా సెంటర్లు, ఆర్జేసీ, ఆర్డీసీ రాసే విద్యార్థులు ఇలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	ఆర్జేసీ	ఆర్డీసీ
హనుమకొండ	10	1,843	628
వరంగల్	8	1,590	448
మహబూబాబాద్	06	962	476
జనగామ	04	562	277
ములుగు	03	478	162
జేఎస్ భూపాలపల్లి	06	1,039	246

నేడు కేసీఆర్ రోడ్ షో

- సాయంత్రం హనుమకొండ అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్



హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం హనుమకొండలోకి ప్రవేశించనుంది. సాయంత్రం 6 గంటలకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి డప్పులు, డోలు వాయిద్యాలు, కళాకారుల నృత్యాల మధ్య రోడ్ షో, భారీ ర్యాలీ సాగుతుంది. అనంతరం హనుమకొండ చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగిస్తారు. సమావేశం అనంతరం రాత్రి మాజీ ఎంపీ కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతారావు నివాసంలో బస చేస్తారు. సోమవారం ఉదయం బస్సుయాత్ర బయల్దేరి వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ మీదుగా సాయంత్రానికి ఖమ్మం చేరుకుంటుంది. హనుమకొండలో జరిగే కార్నర్ మీటింగ్‌కు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. కాగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, మర్రి యాదవరెడ్డి, పోలీసు అధికారులు, నాయకులు ర్యాలీ జరిగే రూట్‌తోపాటు హనుమకొండ చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్ స్థలాన్ని శనివారం పరిశీలించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ భవేష్‌మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గర్భస్థ లింగ నిర్ధారణ చర్యలపై జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావుతో కలిసి శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి లింగ నిర్ధారిత పరీక్షలు చేసే కేంద్రాలను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గైనకాలజిస్టు, రేడియాలజిస్టులు, వైద్యాధికారుల ద్వారా లింగ నిర్ధారిత నిషేధిత చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మొదటి కాన్పులో ఆడపిల్లలు కలిగిన దంపతుల వివరాలను ఏఎన్ఎం ఆశ వర్కర్ల ద్వారా సేకరించాలని వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. స్కానింగ్ సెంటర్లలో ఫామ్ –ఎఫ్ రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు, పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతి లేనిదే ఆస్పత్రుల్లో స్కానింగ్ మిషన్లను కొనడం, వినియోగించడం చేయొద్దని తెలిపారు. లింగ నిర్ధారిత నిషేధిత చట్టంపై అవగాహన, అన్‌వాంటెడ్ కిట్ వినియోగం వల్ల ఏర్పడే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. చట్టం అమలులో ఎన్జీఓల పాత్ర ముఖ్యమైనదని, వారిని భాగస్వాములు చేసి ఆడపిల్లల సంఖ్య తగ్గటం వలన సమాజంలో జరిగే పరిణామాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ రామచంద్రరావు మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రారంభించాలని జిల్లాలోని ప్రైవేట్ వైద్యశాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, డీపీఆర్ఓ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ కొమరయ్య, డాక్టర్ శ్రీదేవి, డీఎస్పీ సంపత్‌రావు, డెమో శ్రీదేవి, మారి ఎన్జీఓ సదానందం పాల్గొన్నారు.

ఈవీఎం.. గుర్తుల టెన్షన్?

- వరంగల్ ఎంపీ స్థానం నుంచి బరిలో 48మంది అభ్యర్థులు
- ఒక్కో పోలింగ్ బూత్‌లో మూడు ఈవీఎంలు అవసరం
- మహబూబాబాద్ నుంచి 25మంది.. ఇక్కడా మరో ఈవీఎం
- గుర్తులతోనూ ఓటర్లలో గందరగోళానికి అవకాశం
- స్వతంత్రులు తప్పుకునేలా ముఖ్యుల మంతనాలు
- సోమవారం మధ్యాహ్నం వరకు తేలనున్న సంఖ్య



సాక్షి, వరంగల్: వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల నుంచి బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లతోపాటు గుర్తుల టెన్షన్ పట్టుకుంది. వరంగల్ స్థానానికి 58మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినీలో పది మందివి తిరస్కరించారు. 48 మంది మిగిలారు. వీరందరూ బరిలో ఉంటే అదనపు ఈవీఎంలు అవసరమవుతాయి. మహబూబాబాద్ స్థానంనుంచి 25 మంది ఉన్నారు. ఇక్కడా అదనపు ఈవీఎం అవసరం ఉంటుంది. దీనివల్ల ఓటర్లు గందరగోళానికి గురవడంతోపాటు వారికి కేటాయించే గుర్తులు తమ ఓట్ల చీలికకు కారణమవుతుందనే భయం కూడా ప్రధాన పార్టీ అభ్యర్థుల్లో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికలతోపాటు వివిధ ఎన్నికల్లో ఈ అనుభవాలు ఎదురవడంతో నయానో, భయానో, తమకు దగ్గరి అభ్యర్థులతో వారి నామినేషన్లు ఉపసంహరించుకునేలా మంతనాలు సాగిస్తున్నారు. కాగా, బరిలో ఎంతమంది ఉంటారనేది సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు తేలిపోనుంది.

రంగంలోకి ముఖ్య అనుచరులు..

వరంగల్ స్థానం నుంచి 48 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ లెక్కన మూడు ఈవీఎంల అవసరం ఉంటుంది. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16 మంది అభ్యర్థుల పేర్లు పొందుపరుస్తారు. 16 మందికి మించి ఉంటే 2 బ్యాలెట్ యూనిట్లు, 32 మందికి మించి అభ్యర్థులుంటే 3 బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటుచేయాలి. మహబూబాబాద్‌నుంచి 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రూటినీలో ఐదుగురివి తిరస్కరించారు. 25మందితో జాబితా తయారు చేశారు. నామినేషన్లు ఉపసంహరించుకోకుండా అందరూ బరిలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరమవుతాయి. ఇప్పుడు ఇదే ముఖ్య అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. దీనికితోడు ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లను పోలినట్టుగా స్వతంత్ర అభ్యర్థుల పేర్లు ఉండడం ఆలోచనలో పడేసింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ముఖ్య అనుచరులను రంగంలోకి దింపారు. బరిలో ఉన్న స్వతంత్రులను ఉపసంహరించుకునేందుకు ఏం చేయాలన్న దానిపై మంతనాలు సాగిస్తున్నారు. ఉపసంహరణకు సోమవారం వరకు సమయం ఉండడంతో స్వతంత్రులు కూడా ఏం జరుగుతుందో చూద్దామని వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. 'గత ఎన్నికల్లో రోడ్డు రోలర్ గుర్తు, ట్రాక్టర్, గ్లాస్ తదితర గుర్తులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు పడే ఓట్లను లాగేసుకున్నాయి. దీనికితోడు అభ్యర్థులు ఎక్కువమంది బరిలో ఉండడం వల్ల ఈవీఎంల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అందుకే అటు గుర్తులు, ఇటు ఈవీఎంల సంఖ్యను తగ్గించేందుకే కొందరు స్వతంత్రులతో మంతనాలు సాగిస్తున్నాం' అని ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ముఖ్య అనుచరుడు అన్నారు.



సీఎం సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్/రేగొండ: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30వ తేదీన రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. రేగొండ మండల కేంద్రంలోని పరకాల రోడ్డులోని నూతన పెట్రోల్ పంపు వెనకాల ఉన్న స్థలంలో నిర్వహించబోయే సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా రానున్నారని తెలిపారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు దేవన్, నాయకులు రాంనర్సింహారెడ్డి, బుర్ర కొమురయ్య, ఆకుల మహేందర్, కర్ణాకర్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

రేగొండ: స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సభాస్థలాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా రానున్న బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. సభకు వివిధ రూట్లలో వచ్చే వాహనాలను వారికి కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలలో పార్కింగ్ చేసేలా చూడాలని చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రవికుమార్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎంపీపీ పున్నం లక్ష్మి, జెడ్పీటీసీ సాయిని విజయ, జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాష్, మండల అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు. సీఎం బహిరంగ సభ ప్రాంగణం, హెలీప్యాడ్ స్థలం, వాహనాల పార్కింగ్ స్థలాన్ని డీఎస్పీ సంపత్ రావుతో కలిసి ఎస్పీ కిరణ్ ఖరే శనివారం పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ మల్లేష్ యాదవ్, రేగొండ ఎస్సై రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

నేర సమీక్షలో ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలని ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంత గ్రామాల్లోని ప్రజలు నిర్భయంగా ఓటు వేసే వాతావరణం కల్పించాలని తెలిపారు. ఓటింగ్ శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే.. లాంగ్ పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. నేర విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి, బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితోపాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలన్నారు. జూదం, బెట్టింగ్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘాతో చట్ట ప్రకారం కేసుల నమోదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భూపాలపల్లి, కాటారం, వర్టికల్, సైబర్ క్రైమ్ డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, నారాయణనాయక్, సుభాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు కోచ్‌ల నియమాకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ ఇన్‌చార్జ్ అధికారి సీహెచ్ రఘు శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడా అంశాలకు ఔత్సాహిక కోచ్‌ల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీలోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారులు, జాతీయ స్థాయి క్రీడాకారులు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహించవచ్చని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 96180 11096, 83285 77652 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

బీజేపీని ఓడిస్తేనే ప్రజాస్వామ్యం నిలుస్తుంది

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి


మాట్లాడుతున్న శ్రీహరి, చిత్రంలో కావ్య

హన్మకొండ చౌరస్తా: దేశ భవిష్యత్‌కు –2024 పార్లమెంటు ఎన్నికలు కీలకమని, బీజేపీని ఓడిస్తేనే దేశంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం నిలబడుతాయని స్టేషన్‌ ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్‌ వరంగల్‌ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్‌ కడియం కావ్యతో కలిసి హనుమకొండలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని చూస్తోందని, ప్రధాని మోదీ నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా అభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళికను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని వివరించారు. కాళేశ్వరం బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోవడానికి కేసీఆర్‌ బాధ్యత వహించాలని డిమాండ్‌ చేశారు. ఫోన్‌ ట్యాపింగ్‌ సాధారణమన్న కేసీఆర్‌.. అధికారులను బలిచేశారని, ఆయన ప్రమేయం లేకుండానే ట్యాపింగ్‌ చేశారా అని ప్రశ్నించారు. హరీశ్‌రావు పక్కా డ్రామా మాస్టర్‌ అని అన్నారు. 'డాక్టర్‌ కావ్య ఎంపీగా గెలిచాక మందకృష్ణ నా ఇంటికొచ్చి దండం పెడతాడు' అని పేర్కొన్నారు. 'నా వద్ద రూ.వందల కోట్లు ఉన్నది నిజమైతే ఈడీ, ఇన్‌కం ట్యాక్స్‌ సోదాలు ఎందుకు చేయడం లేదు' అని అన్నారు.

కోర్టు.. చరిత్రాత్మక తీర్పు ఇవ్వబోతోంది

- ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో 30మంది బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి


జనగామలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జనగామ: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో కోర్టు.. చరిత్రాత్మక తీర్పు ఇవ్వనుందని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ భువనగిరి పార్లమెంట్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోరుతూ జనగామ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన కార్నర్‌ మీటింగ్‌లో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కోర్టు తీర్పుతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో సహా 30మంది ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కాబోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అనేక కేసుల్లో రాజకీయ పార్టీలను రద్దు చేసిన చరిత్ర కూడా ప్రజాస్వామ్య దేశంలో ఉందని, బీఆర్‌ఎస్‌కు అదే గతి పట్టే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేసీఆర్‌ దుర్వినియోగంతో దాగిన నిజాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తాయన్నారు. కోర్టు కూడా ధర్మం, న్యాయం వైపే నిలబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు అయితే, సెకండ్‌ ప్లేస్‌లో ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, భూముల ధారాదత్తం, ప్రతి పనిలో కమీషన్ల దందా ఇలా అనేక అక్రమాలకు పాల్పడిన తండ్రి, కొడుకు, అల్లుడు కూడా రేపో, మాపో కవితకు తోడుగా తీహార్‌ జైలుకు పోవాల్సిందే అన్నారు. కేసీఆర్‌ నోరు అదుపులో పెట్టుకోకపోతే బొక్కలో వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌ కుమార్‌ గౌడ్‌, మాజీ ఎమ్మెల్యేలు నాగపురి రాజలింగం, సీహెచ్‌ రాజారెడ్డి అన్నారు.



మట్టి మోస్తా.. ఎంపీనవుతా..

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌ మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌ తట్టమోసి ఓట్లు అభ్యర్థించారు. శనివారం నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి చెరువులో ఉపాధి హామీ కూలీలను కలిసి మట్టి తవ్వి తట్ట మోశారు. చేతి గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు.

– నెల్లికుదురు


ఓటును బహిరంగపరిస్తే రద్దే..!



కాజీపేట: ఓటు వేసేటప్పుడు ఓటరు స్మార్ట్‌ఫోన్‌లో సెల్ఫీలు దిగడం, ఇతరులకు చూపించడం నేరంగా పరిగణించనున్నట్లు ఎన్నికల కమిషన్‌ స్పష్టమైన నిబంధన విధించింది. రూల్‌ 49ఎం (ఓటు రహస్యం) ప్రకారం ఓటును బహిర్గతం చేస్తే ఎన్నికల అధికారులు గుర్తించి సదరు ఓటరును వెంటనే బయటకు పంపించడంతో పాటు ఆ ఓటును 17 –ఏలో నమోదు చేస్తారు. దీంతో ఆ ఓటు లెక్కింపు సమయంలో చెల్లదు. రూల్‌ 49ఎస్‌ ప్రకారం అంధులైన ఓటర్లు తాము ఓటేయడానికి 18ఏళ్లు దాటిన సహాయకుడిని వెంట తీసుకుని రావొచ్చు. కానీ, సదరు వ్యక్తి అతడి ఓటును బహిరంగ పర్చనని నిబంధన –10లో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

పద పద.. పార్టీ మారుదాం

ప్రాధాన్యం కోసం నాయకుల పాకులాట



కాజీపేట: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో కాజీపేట మండలంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీల క్యాడర్‌ స్వరూపం మారిపోతోంది. కాజీపేట మండలంలో స్టేషన్‌ ఘన్‌పూర్‌, వర్ధన్నపేట, వరంగల్‌ పశ్చిమ నియోజక వర్గాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు ఓడిపోయి కాంగ్రెస్‌ నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో కారు గుర్తు పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులతో పాటు కిందిస్థాయి క్రియాశీలక కార్యకర్తలు ఒక్కొక్కరు తమకు అనుకూలంగా ఉండే పార్టీల వైపు క్యూ కడుతున్నారు. ఈ పార్లమెంట్‌ ఎన్నికలలోపే సరైన ప్లాట్‌ ఫాం చూసుకునేందుకు నాయకులు తెగఆరాటపడి పోతున్నారు. ఇప్పుడే పార్టీలో ప్రాధాన్యం పెంచుకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చక్రం తిప్పవచ్చనే భావనతో పదపదమంటూ చేరికల వైపు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా..

పల్లె, పట్టణమనే తేడాలేకుండా కొందరు పూర్తిస్థాయి రాజకీయాలకు అంకితమయ్యారు. ఏదో ఒక పదవిలో ఉండాలనే ఆకాంక్ష వారిని పార్టీ ప్రతినిధులుగా మారుస్తోంది. పార్లమెంట్‌ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఏ పార్టీ నుంచైతే ఏంటి రప్పించుకునేందుకు అధిష్టానాలు పచ్చజెండా ఊపుతున్నాయి. దీంతో పలువురు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలు మారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. ఇప్పుడు క్రియాశీలకంగా ఉంటే వచ్చే మున్సిపల్‌, స్థానిక సంస్థలు, సొసైటీల ఎన్నికల్లో తమ ఆధిపత్యమే ఉంటుందని విశ్వసిస్తూ కండువాలు కప్పుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

ముందు వరుసలో ముఖ్య నేతలు

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరనే నానుడిని నిజం చేస్తూ వర్ధన్నపేట, స్టేషన్‌ ఘన్‌పూర్‌, వరంగల్‌ పశ్చిమ నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు పార్టీలు మారుస్తున్నారు. వరంగల్‌ మున్సిపల్‌ పాలకవర్గంతో పాటు మండలం, పట్టణానికి చెందిన కీలక నేతలు కండువాలు మార్చుకుంటున్నారు. అధికారం కోల్పోగానే బీఆర్‌ఎస్‌ ద్వితీయ శ్రేణి నేతలంతా ఇతర పార్టీల్లోకి వరుస కట్టారు. అసెంబ్లీ ఎన్నికల పోరులో పరస్పరం విమర్శ, ప్రతి విమర్శలు చేసుకున్న వారు ఇప్పుడు ఒకే గొడుగు కిందికి వెళ్తున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రూ.2,80,400 నగదు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొత్తగూడ: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్న రూ.2,80,400 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎంచగూడెం గ్రామానికి చెందిన రోడ్లకంటి అనిల్‌ రెడ్డి వద్ద రూ.లక్షా 37వేల 700 నగదును గుర్తించి సీజ్‌ చేసి ములుగు కలెక్టర్‌ గ్రీవెన్స్‌ సెల్‌కు పంపించినట్లు గూడూరు సీఐ బాబూరావు తెలిపారు. తనిఖీల్లో కొత్తగూడ, గంగారం ఎస్సైలు దిలీప్‌, రవికుమార్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో రూ.80 వేలు..


భూపతిపేట చెక్‌ పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

గూడూరు: పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా మండలంలోని భూపతిపేట ఎన్‌హెచ్‌పై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నర్సంపేట డివిజన్‌ చెన్నారావుపేట మండలానికి చెందిన పి.వంశీ అనే వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.80 వేలను సీజ్‌ చేసినట్లు సీఐ కె.బాబూరావు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై సీహెచ్‌ నగేష్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రవీందర్‌ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లిలో రూ.62,700

దోర్నకల్‌: డోర్నకల్‌ మండలం ములకలపల్లి చెక్‌పోస్ట్‌ వద్ద రూ.62,700 నగదును శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా పుట్టకోటకు చెందిన ఒర్సు కనకయ్య.. ప్రైవేటు వాహనంలో ములకలపల్లి చెక్‌పోస్ట్‌ మీదుగా చింతపల్లి వెళ్తుండగా సిబ్బంది తనిఖీ చేయడంతో రసీదులు లేని రూ.62,700 నగదును సీజ్‌ చేసి బాధితుడికి రసీదు అందించారు.

నకిలీ వైద్యుడి పరార్‌


నకిలీ డాక్టర్‌ సెంటర్‌ వద్ద యాంటీ క్వాకరీ సభ్యులు, ఐఎంఏ వైద్యులు

హన్మకొండ: హనుమకొండ ఇందిరానగర్‌లో డాక్టర్‌ బోర్డు పెట్టి చికిత్స చేస్తున్న నకిలీ వైద్యుడు.. అధికారులు వస్తున్నారనే సమాచారంతో పరారయ్యాడు. తన క్లినిక్‌ సమీపంలో నకిలీ వైద్యుడు డాక్టర్‌ బోర్డు పెట్టి చికిత్స అందించడాన్ని ఐఎంఏకు చెందిన ఓ వైద్యుడు గమనించి తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌కు సమాచారం అందించాడు. ఐఎంఏకు చెందిన డాక్టర్ల బృందం సభ్యులు, తెలంగాణ మెడికల్‌ కౌన్సిల్‌ సభ్యులు హనుమకొండ డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. యాంటీ క్వాకరీ కమిటీకి సమాచారం అందించారు. నకిలీ వైద్యుడు పెట్టిన బోర్డును ఐఎంఏ వైద్యులు ఫొటో తీస్తుండగా గమనించిన సదరు వైద్యుడు శనివారం డీఎంహెచ్‌ఓ, యాంటీ క్వాకర్‌ కమిటీ వచ్చేలోపు బోర్డు తీసేసి, సెంటర్‌ మూసివేసి పరారయ్యాడని ఐఎంఏ వైద్యులు తెలిపారు.

ఒడిశా టు సూరత్‌

- మానుకోటలో 14.450 కిలోల ఎండు గంజాయి పట్టివేత

మహబూబాబాద్‌ రూరల్‌ : ఒడిశా రాష్ట్రం నుంచి మహారాష్ట్రలోని సూరత్‌ పట్టణానికి తరలిస్తున్న 14.450 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్‌ టౌన్‌ సీఐ పెండ్యాల దేవేందర్‌ అన్నారు. ఈమేరకు టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు వివరాలను ఆయన శనివారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని నయాగరా జిల్లా ఖాందపాడ్‌ గ్రామం శివమందిర్‌ ప్రాంతానికి చెందిన రంజిత ప్రధాన్‌.. రెండు బ్యాగులను తీసుకొని భువనేశ్వర్‌ నుంచి ముంబై వెళ్లే రైలు ఎక్కి విజయవాడలో దిగి మహారాష్ట్రలోని సూరత్‌ పట్టణానికి వెళ్లేందుకు నవజీవన్‌ రైలు ఎక్కారు. ఎన్నికల నిబంధనల అమల్లో భాగంగా వరంగల్‌ పట్టణంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారని ప్రయాణికుల ద్వారా సమాచారం తెలుసుకుని రైలుదిగి బస్సు ద్వారా వెళ్దామని మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలోని తొర్రూరు బస్టాండ్‌ ప్రాంతానికి వచ్చి నిలబడ్డారు. అనుమానాస్పదంగా కనిపిస్తున్న రంజితను టౌన్‌ ఎస్సై చల్ల అరుణ విచారించి ఆమె వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా రెండు బ్యాగుల్లో 14 కిలోల 450 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. దాన్ని స్వాధీనం చేసుకొని టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌కు తరలించి రెవెన్యూ సిబ్బంది శ్రీవాస్తవ, బిస్మిల్లాబి సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఆమెపై కేసు నమోదు చేసిన అనంతరం కోర్టులో ప్రవేశ పెట్టేందుకు తీసుకువెళ్లారు. తనిఖీల్లో పీసీలు శ్రీకాంత్‌, అనిల్‌, కల్పన, యుగంధర్‌, రమేష్‌ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లో 5కిలోలు..


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్‌ సీఐ రాజు

ఖిలా వరంగల్‌: వరంగల్‌ శివనగర్‌ ఆటో స్టాండ్‌ వద్ద ఓ వ్యక్తి నుంచి 5కిలోల 145 గ్రాముల ఎండు గంజాయిని ఎక్సైజ్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజు కథనం ప్రకారం శివనగర్‌ వైపు థర్డ్‌ ప్లాట్‌ఫారం పరిసరాల్లో స్టేట్‌ ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీధర్‌, మండల ఎక్సైజ్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఒడిశా నుంచి వరంగల్‌ మీదుగా హైదరాబాద్‌కు ఓ వ్యక్తి గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వారికి అందింది. శివనగర్‌ ఆటో స్టాండ్‌ వద్ద మాటు వేసి అనుమానాస్పదంగా కనిపించిన ఉత్తరప్రదేశ్‌ గోండ్‌ జిల్లాకు చెందిన పంకజ్‌ వర్మను అదుపులోకి తీసుకుని అతడి బ్యాగులోని 5.145 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పంకజ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ రాజు వివరించారు. తనిఖీలో ఎస్సై రమాదేవి, కబీర్‌ దాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి


తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా కార్యవర్గం

హన్మకొండ: పశు వైద్యులు శాస్త్రీయ నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని వరంగల్‌ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్‌ బాలకృష్ణ సూచించారు. హనుమకొండ 100ఫీట్ల రోడ్డులోని శ్రీమాత బాంక్వెట్‌ హాల్‌లో తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఆధ్వర్యంలో ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. రిటైర్డ్‌ వెటర్నరీ డాక్టర్స్‌ అసోసియేషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ చంద్రమౌళి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోనే బెస్ట్‌ డాక్టర్‌ వెటర్నరీ డాక్టర్‌ అని ప్రశంసించారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ పశువులకు వైద్య సేవలు అందిస్తుంటారని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ వెటర్నరీ అసోసియేషన్‌ ఉమ్మడి వరంగల్‌ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్‌ బాలకృష్ణ, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌గా డాక్టర్‌ కె.వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్‌ ఎం.రాము, కోశాధికారిగా డాక్టర్‌ టి.బాలాజీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్‌ కె.వెంకటనారాయణ, ములుగు జిల్లా పశు వైద్యాధికారి జె.రవికుమార్‌, జనగామ జిల్లా పశు వైద్యాధికారి ఎస్‌ఎల్‌.మనోహర్‌, ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ బి.బాబు, అసోసియేషన్‌ నాయకులు డాక్టర్‌ కె.ప్రవీణ్‌కుమార్‌, డాక్టర్‌ సారంగపాణి, డాక్టర్‌ బి.వినయ్‌, డాక్టర్‌ ఎస్‌.అశోక్‌, ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని పశు వైద్యులు పాల్గొన్నారు.

పిల్లలకు బండ్లిచ్చి జైలుకు పంపొద్దు!

- అడుగడుగునా పోలీసుల తనిఖీలు
- మూడు నెలల్లో జువైనల్‌ హోమ్‌కు 113 మంది మైనర్లు
- మితిమీరిన వేగంతో రోడ్డు ప్రమాదాలు
- తల్లిదండ్రులను హెచ్చరిస్తున్న పోలీసులు


ఒకే వాహనంపై ప్రయాణిస్తున్న నలుగురు మైనర్లు

వరంగల్‌ క్రైం: సెలవులు కదా డ్రైవింగ్‌ నేర్చుకుంటారనో.. చిన్న చిన్న పనులు చేసిపడతారనో పిల్లలకు బండ్లు ఇస్తే కటకటాలు లెక్కించాల్సిందే అంటున్నారు గ్రేటర్‌ వరంగల్‌ పోలీసులు. ఓ వైపు సిటీలో ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణ, మరో వైపు మైనర్లు వాహనాలతో రోడ్లెక్కడం, తరచూ ప్రమాదాల బారిన పడడం ట్రాఫిక్‌ పోలీసులకు తలనొప్పిగా మారింది. మితిమీరిన వేగం, ఇష్టారాజ్యంగా రోడ్లపై సర్కస్‌ ఫీట్లు వేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వీరిని కంట్రోల్‌ చేయడం పోలీసులకు పెద్ద టాస్క్‌గా మారింది. రోడ్లపై ట్రాఫిక్‌ పోలీసులు చేస్తున్న తనిఖీలు చూసి వారిని తప్పించుకునే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక్కో వాహనంపై నలుగురి వరకు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్‌ సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్‌ పోలీసుల కంటపడొద్దని మైనర్లు నానా తంటలు పడుతున్నారు.

రేసింగ్‌లు.. సర్కస్‌ ఫీట్లు

ఎలక్ట్రిక్‌ వాహనాలు, స్కూటీలు, పెద్ద పెద్ద వాహనాల్ని మైనర్లు విచ్చలవిడిగా నడుపుతున్నారు. తల్లిదండ్రులు ప్రధానంగా పిల్లల సంతోషం కోసం వారికి వాహనాల్ని అప్పగిస్తూ.. లేని పోని ప్రమాదాల్ని కోని తెచ్చుకుంటున్నారు. రోడ్లపై అక్కడక్కడా ప్రత్యక్షమై.. కాలనీల్లో మాత్రం రేజింగ్‌లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు స్కూటీలపై వెళ్తున్నారు. వీరంతా పాఠశాలలకు సమీపంలో వాహనాలను పార్కింగ్‌ చేసి పాఠశాలలకు నడుచుకుంటూ వెళ్తున్నారు. పాఠశాల అయిపోయిన తర్వాత స్నేహితులతో కలిసి రోడ్లపైకొచ్చి సర్కస్‌ ఫీట్లు ప్రదర్శిస్తున్నారు.

జువైనల్‌ హోంకు 113 మంది

జనవరి నుంచి ఇప్పటి వరకు డ్రైవింగ్‌ చేస్తూ 113 మైనర్లు పోలీసులకు చిక్కారు. వారిపై కేసులు నమోదు చేసి జువైనల్‌ హోంకు తరలించారు. ప్రతీ శుక్రవారం మైనర్లకు సంబంధించిన కేసులు నాలుగో కోర్టులో విచారణ చేసి జైలుకు పంపుతున్నారు. రెండ్రోజుల పాటు వారు జువైనల్‌ హోమ్‌లో ఉండాల్సి పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీస్‌ అధికారులు సెక్షన్‌ 180, 181 కింద కేసులు నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రుల సమక్షంలో మైనర్లకు వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలోని ట్రాఫిక్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో కౌన్సెలింగ్‌ ఇస్తున్నారు. మైనర్లకు వాహనాలు అప్పగించిన తల్లిదండ్రులు, ఇతరులకు జరిమానాలు విధిస్తున్నారు.

జువైనల్‌ హోమ్‌కు 14 మంది

కాజీపేట: వాహనాలు నడిపిస్తూ పట్టుబడిన 14మంది మైనర్లను ఈనెల 19న పోలీసులు జువైనల్‌ కోర్టులో హాజరుపర్చారు. వారిని ఒకరోజు బాలల పరిశీలన కేంద్రానికి పంపిస్తూ శుక్రవారం కోర్టు తీర్పునిచ్చింది.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ట్రైసిటీ పరిధిలో ప్రత్యేకంగా చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు 113 మంది మైనర్లను జువైనల్‌ హోమ్‌కు తరలించాం. ఈ పరిస్థితి రాకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. పిల్లల సరదా కోసం వారి జీవితాన్ని ఆందోళనలో పెట్టొద్దు. పిల్లలకు డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా వాహనాలు అప్పగించొద్దు. వారిపై నమోదవుతున్న కేసులు వారి కెరీర్‌కు ఆటంకం కలిగిస్తాయి. ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్న అధునాతన వాహనాల వేగం కంట్రోల్‌ కావడం లేదు. పిల్లలకు సరైన వయస్సు లేకపోతే వాటిని కంట్రోల్‌ చేయలేరు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు అప్పగించొద్దని కోరుతున్నాం.

– సత్యనారాయణ, ట్రాఫిక్‌ ఏసీపీ

మెరుగైన సేవలకు నైపుణ్య శిక్షణ

- ఆధునిక సాంకేతిక పద్ధతిపై తర్ఫీదు
- హనుమకొండ జిల్లాలో 311, వరంగల్‌లో 278 మంది విద్యుత్‌ ఉద్యోగులు


శిక్షణలో భాగంగా సూచనలిస్తున్న సీఎండీ వరుణ్‌ రెడ్డి (ఫైల్‌)

హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసే ఆపరేషన్‌, మెయింటెనెన్స్‌ ఉద్యోగులకు ఉత్తర తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ (టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌) నైపుణ్య శిక్షణ ఇస్తోంది. లైన్‌లాస్‌ వంటి నష్టాలు తగ్గించడం, విద్యుత్‌ డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్స్‌ తగ్గింపు, ఆధునిక సాంకేతిక పద్ధతులపై పట్టుకోసం, ప్రమాదాలు తగ్గించడంపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. కొత్తగా నియామకమైన జూనియర్‌ లైన్‌మెన్లకు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే విధుల్లో చేర్చుకుని బాధ్యతలు అప్పగించారు. సంస్థలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన, వృత్తిపరమైన నైపుణ్యం, ఉద్యోగంలో చేరిన వారికి శిక్షణ ఇస్తేనే వారు విధుల్లో, బాధ్యతల్లో మెరుగ్గా రాణిస్తారు. తద్వారా సంస్థకు ప్రయోజనం చేకూరుతోంది.

నష్టాల తగ్గింపుతోపాటు వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించేందుకు సంస్థ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈమేరకు అన్ని సర్కిళ్ల (జిల్లాలు) నుంచి ముందుగా నలుగురు చొప్పున ఆపరేషన్‌, మెయింటెనెన్స్‌ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి గతంలో శిక్షణ ఇచ్చారు. వారు ఇప్పుడు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆపరేషన్‌ మెయింటెనెన్స్‌ ఉద్యోగులైన జూనియర్‌ లైన్‌మన్‌ నుంచి ఫోర్‌మన్‌ వరకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో ఉన్న సౌకర్యాలు, అవకాశాలను బట్టి డివిజన్‌, సబ్‌ డివిజన్‌ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వృత్తిపరమైన సాంకేతిక శిక్షణతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించడం, వినియోగదారుల నుంచి వందశాతం బిల్లులు వసూలు చేసేలా వారిని సమాయత్తం చేస్తున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్‌)

జూనియర్‌ లైన్‌మన్‌, అసిస్టెంట్‌ లైన్‌మన్‌, లైన్‌మన్‌, లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, సీనియర్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌, ఫోర్‌మన్‌ కలిసి హనుమకొండ జిల్లాలో 311 మంది, వరంగల్‌ జిల్లాలో 278 మంది ఉన్నారు. వారిని గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపునకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. వారికి వృత్తిపరమైన శిక్షణతో పాటు, వ్యక్తిగత భద్రతపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. వ్యక్తిగత రక్షణకు అవలంబించాల్సిన పద్ధతులను వివరిస్తూ వాటిని తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, సీపీఆర్‌ పద్ధతిపై వివరిస్తున్నారు. ముందుగా శిక్షణ తరగతులు నిర్వహించి విషయ పరిజ్ఞానం కల్పించిన తర్వాత వారిని విద్యుత్‌ సబ్‌ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రాక్టికల్‌గా తీసుకోవాల్సిన సాంకేతిక పద్ధతులను వివరిస్తున్నారు. దీంతో పాటు వారు శిక్షణను ఏ మేరకు అర్థం చేసుకున్నారు, శిక్షణలో ఇంకేమైన అంశాలు జోడించడంపై ప్రశ్నావళిని అందించి ఫీడ్‌ బ్యాక్‌ తీసుకుంటున్నారు.

శిక్షణతో సాంకేతికాభివృద్ధి



వృత్తిపరమైన శిక్షణతో పాటు సాంకేతిక అభివృద్ధి సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నా. తద్వారా విధుల్లో ఉద్యోగులు మెరుగ్గా రాణిస్తారు. విద్యుత్‌ సరఫరాలో ఏర్పడే వైఫల్యాలు కొంతమేర తగ్గుతాయి. దాంతో వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయంలేని విద్యుత్‌ అందించగలుగుతాం.

– వెంకటరమణ, ఎస్‌ఈ, హనుమకొండ